# మృగశిర చుక్కలు

శ్రీ బాపారెడ్డి మల్లేశ్వరరెడ్డి

సాయంసమయమది. చల్లని సముద్రపు గాలి మెల్ల మెల్లగా వీచే సమయమది. తెల్లని బుల్లి మబ్బులు ఆకాశంలో ఆడుకొనే సమయమది. దినమంతా ఎఱ్ఱనిఎండలో కృషి చేసి విశ్రాంతిగా వాకిటకూచొని కాపులు కులాసాగా కబుర్లుచెప్పు కొనే సమయమది. నిరుత్సాహ భరితులైన నిరుద్యోగులు, దరిద్ర దేవతాజ్వాలలో దహింపబడుతున్న తోడి మానవులను అరికాలు కింద అణగదొక్కి నీచపు ప్రఖ్యాతి కోసం పాటుపడుతున్న దొంగ మర్యాదస్తులు, కంటికగపడని హాఊ ప్రపంచంలో విహారం చేసే విద్యార్థులు, మదించిన మదుపుదార్ల మరలకు ఆహుతియై మలమల మాడే కార్మికులు, ఆబాలగోపాలమూ రేడియో యుద్ధవార్తలకు విరామంగా పార్కులో ఎదురుచూస్తో ఉండే సమయమది. పచ్చని లే బచ్చికను కడుపునిండా మేసి ఆవులు 'అంబా' అని అరచు తమ దూడలకు పాలిచ్చుటకై యిండ్లకు చేరే సమయమది. పక్షులు తమ గూండ్లలో మేతలకోసం వేచియున్న పిల్లలతో కిచకిచలాడుతూ ఉండే సమయమది. ప్రియులరాకకై ప్రియు రాండ్రు నిరీక్షిస్తూ నిమిషమో యుగంవలె గడిపే సమయమది. విశ్వమోహినీ చంద్రోదయంకొరకు కలలుకంటూ కనిపెట్టుకొని ఉండే సమయమది.

ఫల్గున మాసమది. శుక్లపక్షం. ఆ వేళ త్రయోదశి. ఎండలు అప్పుడే నడకబట్టి తప్పటడుగులువేసే పసిబిడ్డ ప్రాయంలో వున్నాయి.

ఆ సమయం, అటువంటి ఆనందమైన సమయం, అతనికి మాత్రం నరకం. యమలోకం!

పొట్టనిండా పాలుతాగి వాయుదేవుడితో ఊసులాడుతూ వున్న పసికూనలా పడమర కుంకుమపాన్పులో పొర్లుతూవున్న సూర్యునివైపు తదేకధ్యానంతోచూస్తో మడతకుర్చీలో ఏకాంతంగా కూచొని వున్నాడు మదనుడు మేడగది కిటికీలను బారుగా తెఱచి

................

ఆ రెండు కారుమేఘాలు అంత క్రూరంగా, మూర్ఖంగా ఆ మెత్తని ఊదారేఖని పెనవేసుకొని ఆర్పివేయడం ఎంత అన్యా యం! న్యాయన్యాయావితక్షణావిజ్ఞానం ఆ రాక్షస మేఘాలకు వుంటుందా? వెన్నముద్దకు సహజంగా వుండే సున్నిత, సరళ గుణాలు బండరాయికి వుంటాయా?

ఆ దీర్ఘాలోచన, ఆ కనుబొమల కంగారు, ఆ నిట్టూర్పుల నిరాశ, ఎండమావులవెంబడి వెఱ్ఱిగా పరుగిడుతున్న లేళ్ళు, ఉదయభానుడితో ఉల్లాసంగా ఊసులాడే పశికూనలు, మరో లోకంలో మారుమోగుతున్న ధ్వనుల మధ్య మయమరచినమదనుడు.

అతని మనోవీధిలో తుపాను వాయువులు 'రివ్–రివ్' మని వీస్తున్నాయి. ఏదో ఘోరమైన నేరం చేసినట్లు పరితపిస్తున్నాడు.

అతడు దోషియో లేక నిర్దోషియో నిర్భయంగా నిర్ధారణ చేయగలమా?

ఆ భయంకర ముఖచిహ్నాలనుబట్టి అతడు దోషియని నిస్సందే హంగా చెప్పగలమా?

నిజానిజములు తెలుకోడానికి 'చొరలోతు,' తినతీపి తెలీయునా?

అతని హృదయరంగాన ఏదియో ఓ గొప్ప ద్వంద్వ యుద్ధం హోరాహోరీగా జరుగుతోంది.

"అన్యాయంగా, అక్రమంగా యుద్ధమునకు కాలుదువ్విన వారికిదే ఫలితం!"

"నిజం కోసం, న్యాయం కోసం శత్రువులను ఎదుర్కొడా నికి వెనకంజవేయను!!"

"ధైర్యం పురుషలక్షణం గాదా?"

"ప్రయత్నం నా కర్తవ్యం గాదా?"

"నిజం నిలకడమీద తెలీయదా?"........

'దోషిని'

'పాపిని!!'

'హంతకుడను!!!'

ప్రపంచమే ఎగరుని ఓ అమాయకరాలిని మంగళసూత్ర మనెడు మరఫిరంగికి బలియిచ్చాను!....స్త్రీహత్య!!

'కాదు!....పొరబడుతున్నాను!!....నాదోషం గాదు! నాఅప రాధంగాదు!! అమానుషంగా నన్ను బలవంత పెట్టిరి—నాహృదయం వారి ఆధీనం!నేను వారి బానిసను!!....నాకు స్వతంత్రంలేదా? నాలో పురుషత్వంలేదా? నన్ను కని, పెంచి, పెద్దచేసి, సంగీత సాహిత్యాది కళలు నేర్పించి చివరకు నన్ను అంగడిలోబెట్టి వేసి పాడించుటకా? భారతదేశంలో బానిసవర్తకం నేటికీ నిర్మూలంగాలేదా? అంత మొందడానికి అవకాశాలు లేవా? ఆచంద్రార్కమూ భారతీయుడు బానిసీడుగా వుండవలసినదేనా? వివాహమనగా పెట్టుబడిలేని వ్యాపారమా? ఐతే, కాయగూరలు, బట్టలు, మరలు, ఆవులు, మేకలు బజార్లువల్లె 'భార్య భర్తల బజార్లు' ఎందుకు స్థాపించకూడదు మన సంఘం? ఈ పెండ్లిపెద్దలు. రాయబార్లు యీవ్యాపారం ఎందుకు సాగించకూడదూ? పతితపావనమైన యీ భారతదేశంలో జన్మించిన

నారీమణులను అంగడిలో బెట్టి యేలంపాడించి విక్రయిస్తే మన సనాతన ధర్మ పారాయణ శ్రేష్ఠులు గుడ్లు మిటకరిస్తారని భయ పడతారా? ఏం ఫరవాలేదు? ఈ ఆచారం మన దేశానికి కొత్తగాదు. కాశీపట్నం నడివీధిలో మహారాణీలను మనవాళ్లు యేలం వేయలేదా? రారాజులు వివాహ రాయబారాలు నడుపలేదా? ఇప్పుడు మనవాళ్లు చేస్తున్నదంతా ఏమిటీ? పోటీలేని రహస్య యేలంగాదా? దీనికిబదులు బహిరంగ యేలం వేయిరెట్లునయంగాదా? ఇదొకవిధమైన స్వయం వరం! పెట్టుబడిలేని వ్యాపారం!! ఏదేశమన్నా ఆర్థికంగా దృఢపడా లంటే ఆదేశీయులు వ్యాపారం, వాణిజ్యం వృద్ధిచేయాలి. ఇండియా ప్రభుత్వపు ఆర్థికశాఖవారు యీపద్ధతిని అమలులో పెడితే మనదేశా నికి ఎంతశ్రేయస్కరం!

ఆపరాధిని గానని యీ ప్రపంచానికి ఒప్పించడానికి నడుము గట్టి ముందంజవేసి నడుస్తున్నాడు మదనుడు.

కాలుజారుసంతలో అమాంతంగా పాతరగోతిలో పెట్టి సమాధిచేడాయనికి వెంటాడుతోంది పిశాచసంఘం.

అతనికుర్చీకి రెండు మూడడుగుల దూరంలో ఓచిన్న టేబిలు. దానిమీద ఓ పలుచని గులాబీరంగు బట్ట. ఆబట్టమీద చక్రవాక-దాంపత్య కవనం. ఓరైటింగ్ పేడ్. రెండు మూడు త్తరాలు. అంతేకాదు. పైపుతో అడ్రసు రాయబడి అప్పుడే చింపబడి వున్న మరోకవరు. ఆరైటింగ్ పేడ్ మొదటి కాయితం మీద యిట్లు అచ్చు వేయబడివుంది:

మదన, బి. ఏ. హరిపురం,
తే............1942.

........................................

డియర్ అనుమాట మాత్రం అచ్చుకాదు,—చేరాత. రెండు సార్లు కొట్టబడివుంది. ఆవుత్తరం అంతటితో ఆగింది.

ఆటపాలో వచ్చిన వుత్తరానికి ఆక్షణం జబాబు రాయ తలంచినవాడు, ఉత్తరం ఎందుకు పూర్తిచేయలేదో!

లంగరుతెగిననావ తుపానులో. రెండు నీటి బిందువులు ఆనల్లని కంటిపాపలు మీద——అవి భావపూరితములు.

సగం నిద్రకళ్ళతో తల్లిరొమ్ముకోసం వెతకులాడే చంటి బిడ్డలా దేవులాడుతున్నాడు సూర్యుడు పశ్చిమ కొండల్లో.

## 2

'మదనా! నీవు పట్టినకుందేటికి మూదేకాళ్ళంటావ్!' అంటూ మొదలుబెట్టాడు దాసు.

'బొల్లిసామెతలు, మూరెడుబారెడు సమాసాలుఅంటే ఒళ్లు మండుకుపోతోంది నాకు — జరగవలసినదేదో జరిగింది అంతే గాని——'

అని మదనుడు సమాధానం చెబుతుండగా 'బాబూ! విశ్వా మిత్రా. తగ్గు! నీలాంటివాళ్ళు గ్రామానికి ఓఅరడజను చొప్పున మనదేశంలో జన్మించివుంటే ఓ నూరేళ్ళక్రితానే భారతదేశం స్వతంత్రదేశమయ్యేది—గాని లోకం నడిచినతోవ నీవు నడవకపోవ డంవల్ల, నీ ప్రస్తుత పరిస్థితి ఎట్లా పరిణమించిందో గమనిస్తు న్నావా?' 'అదావిషయం! నేనుమాత్రం 'లోకం అంధకారబంధురం' 'ప్రేమగుడ్డిది' అనే తందానపాటగాడనుకాదు. అంతేకాదు. నాకూ స్నేహితులకు, నా బంధువులకు, నా పరిచయస్తులకు మధ్యనున్న మిత్రత్వం, బంధుత్వం. పరిచయం ఓ పెద్దస్వప్నం! ఎటువంటి నేరమూచేయని అమాయకులగు బర్మానివాసులమీద ఆ దౌర్భాగ్యపు జపానువాడు బాంబులు వేసేడంటే ఏంతకోపమో నాకు. ప్రాణరక్షణ చేసుకోవాలన్న ఆశతో రాకరాక యీ బానిస భారతదేశంలోకి కాందిశీక యాత్ర సల్పినవారిమీద అంతే కోపం నాకు.——దాసూ: 'కాందిశీకులు' అన్నశబ్దం విన్నంతనే నాహృదయం ఆవేదనాపూరితమౌతోంది. నాగుండె భగభగమండుతోంది. కాందిశీకులను చూసినప్పుడల్లా పెద మొహం పెట్టుకొంటాను. గాని సాహసింపలేను. సూర్యరశ్మికి మంచుపర్వతంలా కరిగి కుమిలిపోతాను. ఎక్కడన్నా మీకు తోవలో మణి అనేపిల్ల అగుపించిందా అని వెఱ్ఱిగా అడుగుతాను. బాబూ! డిశెంబరు యిరవైమూడోతారీఖు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా మా గుం డెలు పగిలిపోతాయి అని సమాధానం చెబుతారు. నిరాశజెంది యిల్లు చేరుకొంటాను. రంగూను నుంచి మణి నాకు రాసిన వుత్తరాలకట్ట విప్పుతాను——ఇదిగో! యిదే ఆఖరు వుత్తరం' అంటూ అందించాడు టేబిలుమీద వుత్తరంతీసి దాసుకి మదనుడు.

రంగూన్,
డియర్ మదన్, తే 16—12—1941 దీ.

కలకత్తానుంచి నువ్వు ఏడోతారీఖున రాసిన వుత్తరం అంది నది. పదమూడోతారీఖున స్వగ్రామం వెళ్ళిపోతానని రాశావు. యుద్ధపరిస్తితులు అనుకూలంగా లేవన్నవిషయం నీకూ తెలియక పోదు. వెళ్ళిపో: అక్కడ వుండొద్దు.

బర్మా ప్రమాదస్థితిలోవుంది. రేపో నేడో జపాను విమాన దాడి జరుగునని అనుమానంగావుంది. ప్రభుత్వంవారి రక్షణచర్యలు తీవ్రంగా జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్తితుల్లో స్వదేశం వెళ్ళి పోడం వుత్తమమని, బతికుంటే బలుసాకన్నాతిని జీవించవచ్చోని నాన్నగారితో అప్పుడే మూడుసార్లు చెప్పాను.

జ్ఞాపకంవుందీ నీకు? 1939 మార్చిలో నీవు నాకు రాసిన వుత్తరం! నువ్వు మీనాన్నమ్మగారి యిష్టంప్రకారంగా త్వరగా పెండ్లి చేసుకోకతప్పదని, మీవాళ్ళంతా బలవంతపరుస్తున్నారని, మీయింట్లో ఒత్తిడి సహించలేకుండావున్నానని రాశావు.

నేను నిరాశపడలేదు. వ్యాకులం నా జీవితంలోలేదని నాదృఢ నమ్మకం. పెద్దలమాట జవదాటకు. వాళ్ళు నీమీద అసూయపడతారు. నీజీవితం బూడిదలోపోసిన పన్నీరౌతుంది.

నా జీవితాశ ఒక్కటే; అది నీకుతెలుసు!! నీ హృదయంలో నాకు తావుంటేచాలు!!!

మదన్! మాస్వదేశప్రయాణం నీకుముందుగా తెలియజేస్తాను. అవకాశముంటే వైజాగ్ వస్తానని నమ్ముతాను.

ఇట్లు,
'సీవెన్నెల'

దాసు వుత్తరమంతా పూర్తిగా చదివినతర్వాత :

'ఇదిగో! యీ వుత్తరం చదువు' అంటూ మరోకవరు చేతి కిచ్చాడు మదనుడు.

వేంకటరావు, మకాం: మణిపురం,

మదనబాబూ! తే 28....12—41 దీ.

నిన్ను నేను ఎప్పుడూ చూసివుండలేదు. గాని నీవు ఎవరో నాకు పూర్తిగా తెలుసు. నేను నీకు యిదివరకు ఎన్నడూ వుత్తరాలు రాసివుండలేదు. గాని నీవివిధ పై విలాసాలు నాకు పూర్తిగా తెలుసు.

నీవు మణిపేరనురాసిన నూటాయిరవై నాలుగు వుత్తరాలకట్ట నావద్దనేవుందని నీకు తెలియజేస్తే నేను ఎవరో నీవు నిస్సందేహంగా తెలుసుకొందువని నా పరిపూర్ణనమ్మకం—

'మదనా ఎవరీతను?' అని అడిగాడు దాసు వుత్తరం అక్కడ ఆపి. 'వుత్తరం పూర్తిగా చదువు—నీకేబోధపడుతోంది' అని జవాబు యిస్తో తలదించాడు మదనుడు.

ఉత్తరం మళ్ళీ చదవనారంభించాడు దాసు. డిశెంబరు యిరవై మూడోతారీఖున రంగూన్‌పై జపాను విమానదాడి జరిగినతర్వాత మేము పటాపంచలై పారిపోయాం ఎవరితోవవారు. మణి ప్రసాదులు మానుంచి విడిపోయారు ఆరాత్రే. మోహన్, వాళ్ళమ్మ, నేనూ పిమ్మట మణిపురం చేరుకొన్నాం. మోహన్ బెంగబెట్టుకొన్నాడు. రాత్రింబవళ్ళూ పలువరిస్తాడు. నాన్నగారూ! అక్కయ్యా, తమ్ముడూ సినీమాకు వెళ్లారా? అని అడుగుతాడు.

నీకీ వార్త తెలియజేయడం నాకర్తవ్యం, నాధర్మమనితలంచి యీవుత్తరంరాశాను. వాళ్ళకోసం నిద్రాహారాలులేక వెతుకుతున్నాను. వాళ్ళజాడ తెలిసినవెంటనే నీకు తంతిద్వారా తెలియజేస్తాను.

ఇట్లు,
నీ శ్రేయోభిలాషి, వేంకటరావు.

వుత్తరం పూర్తిగా చదివి స్తంభించిపోయాడు దాసు. మణి మదనుల ప్రేమబంధం త్రెంచడానికి ఎవడితరమౌతోందన్నట్టుగా ఓ దీర్ఘశ్వాసవిడుస్తో పెదవులు వణకించాడు దాసు—

'ఐతే మదనా! మణితో మొదట నీకెలా పరిచయం కలిగింది?' అని మెల్లగా అడిగాడు దాసు. 'అదోపెద్దగాథ! విస్తరించిరాస్తే ఓ పెద్దనవల రాయవచ్చు. యీ కాయితం కరువురోజుల్లో అటువంటి నవలలురాసి ప్రచురించడం చాలా కష్టం. గాని ఎంతకాలమీవిషాధ గ్రంధాన్ని గుండెకాయలో దాచేది! భయపడతాను యీ చిన్నిగుండెకాయ యీ మహావిషాదాన్ని భరించలేక ఎప్పుడు, యేక్షణాన్నపగిలిపోతోందని...అప్పటికి యింకా నేను కాలేజీ విడిచిపెట్టలేదు. దశరా శలవుల్లో ఓమారు వాళ్ళ ఊరురమ్మని 'భ....త్' వుత్తరాలు రాసి రాసి తెగచంపాడు నన్ను. వాడిబాధ పడలేక వెళ్లాను. ఆవేళ సరదాగా బేడ్‌మింటన్ ఆడదామన్నాడు. సరే అన్నాను'....'మణితో మొదట నీకెలాపరిచయం కలిగిందని నేనడుగుతే, వాళ్ళ ఊరువెళ్లాను, ఆవేళ సాయంకాలం—' అని యింకేమో దాసు అంటూండగా

'తొందరపడకు! కాస్తా శాంతంగా విను. ఈ విషాద గాధకి ఆ బేడ్‌మింటన్‌కోర్టే మూలకారణం. ఆ కోర్టు వాళ్ళ యింటికి ఓ యేభై అడుగుల దూరంలోవుంది—ఆట ప్రారంభించాం. ఆటగాంత్రంతా ఆటసరదాలో మునిగున్నారు నేతప్ప. ఆదేసమయానికి మణి వాళ్ళపెరడులో బావివద్దకువచ్చి నీరుతోడుతోంది. నాకు తెలియకుండా నాకండ్లు ఆ బావివైపు తిరిగాయి అప్రయత్నంగా. బంతులన్నీ తప్పిపోతున్నాయి. నేను నిజంగా కోర్టులోవున్నానా లేక ఏభావకవో, ఏ నవీనచిత్రకారుడో సృష్టించిన ఊహాప్రపంచంలో కలలుగంటున్నానా అని సందేహపడ్డాను. ఎడతెరపిలేకుండా నేనావేళ మణినిచూడడం—తనకు నామీద కోపం వచ్చిందేమో—బావిగట్టుమీదవున్న బిందెని తన నడుమువంకలో యిముడ్చుకొని చకచక యింటిముఖం నడిచింది తీక్షణంగా మాకోర్టు వయిపుచూస్తో—' 'ఐతే నీశరీరం కోర్టులో ఆడుతూవుంటే నీ హృదయం బావిగట్టుమీద నృత్యం చేసిందన్నమాట!

'బావిగట్టుమీదకాదు—తన నడుమ వంకలోని బిందెమీద—తన కనుబొమల మధ్యన ప్రకాశిస్తోన్న కుంకుమ చందమామ మీద.'

'అప్పటినుంచీ నీ మనస్సు తనమీద లగ్నమైందన్నమాట'.

'మణితో పరిచయం నాకదే మొదటిసారి—

'భ.......త్' తో వాళ్ళ ఊళ్ళో ఒకటి రెండు రోజులు కులాసాగా కాలక్షేపం చేయడానికి వెళ్ళినవాడను ఓ పదిహేను రోజులుదాకా ఆ వూరు విడిచిపెట్టడానికి మనసొప్పలేదు నాకు. మణిని నేను మొదట సారి చూసినప్పుడే తనని పెండ్లాడాలన్న కోరిక నాలో పుట్టింది. మిగతా గ్రంధమంతా—యిపుడు చెబితే కనీసం ఓ రెండు గంటలౌతోంది—బంగళా కావలి రామయ్యే నడపాడు జయప్రదంగా. పిమ్మట ఓ రెండు మాసాలు తర్వాత వాళ్ళు మళ్ళీ రంగూను వెళ్ళిపోయారు'

'ఈ కోరిక నీలో పుట్టినప్పుడు, మీ వివాహానికి వర్ణవిభేద ప్రతిబంధకాలు అడ్డు తగులుతాయన్న విషయం నీకు స్ఫురించలేదు?'

'ఈ సందేహం నాకూ లేకపోలేదు. గాని, ఆమాత్రం నాన్నగారిని ఒప్పించలేకపోతానా అని ధైర్యపడేవాడిని. అంచేత, అప్పటి నుంచీ, నాన్నగారితో మాట్లాడినప్పుడల్లా, మన దేశంలో జాతి, మతద్వేషం వున్నంతకాలమూ మన కీ అధోగతి తప్పదని, ఏనాడైతే మనదేశంలో అంతర్జాతీయ వివాహాలు జరగడానికి ఎట్టి నిర్బంధనాలు వుండవో, ఆ నాడే మనదేశానికి స్వరాజ్యం, స్వతంత్ర పరిపాలనా అధికారం అని చెబుతుండేవాడ్ని. గాని, పానకంలో పుడకలా వచ్చేది నాన్నమ్మ'.

'ఈ ముసలమ్మలే భారతదేశం వృద్ధిపొందకుండా కాళ్ళూ చేతులూ కట్టేశారు; యీ ముసలమ్మ కథలే మన దేశాన్ని మంటలో బెట్టి బూడిద చేశాయి—పిమ్మట ఏం జరిగింది?' అని దాసు అడుగుతుండగా—

'గుడ్‌మార్నింగ్ మదన! యీవేళ క్లబ్‌కి రావా ఏమిటి?' అంటో ప్రవేశించాడు డాక్టరు సుందరం.

ముగ్గురూ కలసి మోటారులో పోయారు—

'ఐతే పిమ్మట ఏం జరిగిందీ?' అంటూ మళ్ళీ మొదలుబెట్టాడు దాసు ఆ మర్నాడు.

'కథ అడ్డంగా తిరిగింది. ఆ ముసలి కూతురు చచ్చి స్వర్గంలో ఏ మూలుందోగాని, అది బతికున్నప్పుడే నా వివాహం జరగాలని భల్లూకపుపట్టు పట్టింది. దాని దృష్టిలో 'పెండ్లి' అంటే ఓ మీసనిమేధరు వర్ణ్యశాఖని నిర్మించి పిల్లల్ని తయారుచేయడమన్నమాట.......'

'మదన్! పెండ్లికానంత సేపూ వాళ్ళూ, వీళ్ళూ కారకు లంటాంగాని, వివాహానాంతరం ఎవరికి వారే కారకులౌతారు. కమలని నీ అర్ధాంగిగా బ్రహ్మదేవుడు సృష్టించాడు'.

'పెద్ద పొరపాటు! నిజంగా బ్రహ్మదేవుడనేవాడు ఒహ డుంటే, యిది వాడి సృష్టిగాదు. నాపాలిటి బ్రహ్మ నాన్నమ్మ సృష్టి. ఈ వైరాగ్యం మనతోనే పుట్టింది. యీ అంటురోగం మనలో వున్నంత కాలమూ మన బతుకులు యింతే! భారతదేశం రెండు వందల సంవత్సరాల కిందట యెలా వుండేదో, యిప్పుడూ అలాగే వుంది; యిహ ముందూ అల్లాగే వుంటుంది.

'సరి సరి! నాస్తికమతం నాకు బోధచేయ నక్కర్లేదుగాని తర్వాత కథ ఏం జరిగిందోకాస్తా క్లుప్తంగా చెబుదూ' అని దాసు అంటుండగా—

తలుపులమీద దబదబ శబ్దం వినబడ్డది.

'ఎవరది?' అంటో తలుపు తెరచాడు మదనుడు.

'బాబూ! మీకో రెండు ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాములు అంటూ ఓ రెండు కవర్లు చేతికిచ్చాడు మెసెంజరు.

'ఎక్కడనుంచా టెలిగ్రాము' అన్నాడు దాసు కంగారుగా.

'ఇది వైజాగ్ నుంచి' అని చెబుతూ వైరు చదవాడు మదనుడు:

కమల — ప్రమాదస్థితిలో — వుంది.
డాక్టరు — నీ రాక — అవసరమన్నాడు.
గోపాలరావు.

'రెండోది?'

'మణిపురం నుంచి'—

మణిప్రసాదులు — నిన్ననే — మాలో — కలుసు కున్నారు — మణి — అపాయ స్థితిలో — వుంది.
వేంకటరావు.

'దాస్! ఆ రెండు కారుమేఘాలు ఆకాశంలో అమరజ్యోతిలా ప్రకాశిస్తోన్న ఆ ఒక్క ఊదారేఖని పెనవేసుకొని ఆర్పేసాయి. అంతే!' అంటో నేలగూలాడు మదనుడు.

'మదన్! అధైర్యపడకు. మానవశరీరమొక క్షేత్రము. ఆ క్షేత్రంలో ఆత్మాఅంతరాత్మలకు అంతములేని ద్వంద్వయుద్ధం ప్రతి నిమిషం, ప్రతి క్షణం జరుగుచునే వుంటుంది. ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లో మానవధర్మం యొక్క ఔన్నత్యాన్ని నిలబెట్టినవాడే మానవోత్తముడు. యుద్ధరంగాన శత్రువులను ఎదుర్కోవాలి! దేవాసుర సమరంలో అమృతం, విషం పుడతాయి. అమృతమంటే అందరికీ ఆనందమే! ఆ విషాన్ని తాగాలి! దాన్ని భరించాలి! సాధారణ మానవుడులా 'యిపుడు నేను చేయవలసిన దేముందీ?' అని వెఱ్ఱిగా అమూల్యమైన కాలాన్ని చంపడం నీ ధర్మంకాదు'.

'దాసూ! అమావాశ్యరాత్రి ఆకాశంలో చంద్రుడుకోసం వెతికితే కన్పిస్తాడా?'

'నువ్వు నిరాశపడుతున్నావు మదన్! అమావాస్యరాత్రి ఆకాశంలో అగుపించేచంద్రుడే నిజమైన చంద్రుడు; అమావాశ్యరాత్రి ఆకాశంలో చంద్రుణ్ణి చూడగలిగిన మానవుడే అసలైన మానవుడు—యిప్పుడు రెండుజీవాలు నీతీర్పుమీద ఆధారపడి వున్నాయి. ఒకటి నీవుఅగ్నిసాక్షిగా పెండ్లాడినధర్మపత్ని; రెండోది నీవు హృదయపూర్వకంగా ప్రేమించిన ప్రేయసి. ఒకటి సర్వసంగ పరిత్యాగంచేసి నీవే సర్వసమని, నీవేదైవమని నిన్ను ఆరాధిస్తోన్న నీ అర్ధాంగి; రెండోది నిష్కళంకంగా నిన్ను ప్రేమిస్తో, నీహృదయమందిర పూజారిణిగా వుండడానికి, నీ హృదయ నెలవుల్లో వసతియిమ్మని నిన్నుప్రార్థిస్తూ, నీ అనుమతికోసం కని పెట్టుకొనియున్న నీజీవితపువెన్నెల. ఇద్దరూ నీకు సమానులే; యిద్దరికీ నీమీద సమానహక్కులున్నాయి; యిద్దరూ ఒకే ప్రమాదపరిస్థితిలోవున్నారు. గాని, ఒక్కవ్యత్యాసం మాత్రం వుంది: ఒకరు నీకు అందుబాటులేని ఆకాశంలో అల్లాడుతున్నారు; యింకొకరు నీపాదాల వద్ద వున్నారు.

ఈవిషయంలో, యింతకంటె అధికం నేనుచెప్పలేను. ఇక మీద నీ వివేకబలముతో ఆలోచించి నీ కర్తవ్యం నీవు నెరవేర్చు కొంటావని నా నమ్మకం.—పదిగంటలవ్వొస్తోంది మదన్! నేనింకా ఆఫీసుకిపోవాలి. రేపు—ఆదివారం ఉదయాన్నేవస్తాను. మరి వెళ దునా?' అని అడుగుతూ గడియారంవయిపు చూసాడు దాసు.

'మరివెళ్ళు' అంటో కండ్లువిప్పాడు మదనుడు.—నా—తీర్పు! రెండు నిండుప్రాణాలు నారాకకై నిరీక్షిస్తో నిమషాలు లెక్కపెడు తున్నాయి! రెండుజీవాలు నా తీర్పువినడానికి గంపెడాశతో కనిపెట్టు కొనివున్నాయి. ఆ ఒక్క ఊదారేఖ ఆకాశంలో వున్నంతకాలమూ తారాపథము దేదీప్యమానమైన వెలుగులో తాండవమాడుతోంది. ఎంత క్రూరం! ఎంతమూర్ఖం? ఆ రెండుకారుమేఘాలు వాయువేగమను వేగంతో వస్తోన్నాయి ఆరేఖని పెనవేసుకొని! చీకటిలో నాతీర్పు రాయగలనా? ఆ వెలుగులో నాకర్తవ్యం నేను నెరవేర్చాలి!—

'మదన్!' అని లేపుతూ మొహం మీది శాలువా తీశాడు దాసు.

అంబరవీధిలో, దేవలోకంలో గంటలు వాగుతున్నాయి. గడియారం 'టంగ్—టంగ్' మని ఆరుకొట్టింది.

'మదన్!!' అంటో మళ్ళీలేపాడు దాసు, శరీరాన్ని కదుపుతూ.

తారాపథములో, పగలు, చుక్కలు—మృగశిరచుక్కలు మూడు—కవగూడి కిలకిల నవ్వుతున్నాయి. సూర్యకిరణాలు కిటికీ ద్వారా గదిలో ప్రవేశించి చీకటిని తరుముతున్నాయి. మూడుకిరణాలు మాత్రమే! 'మదన్!!!' అంటో మళ్ళీపిలిచాడు దాసు స్పృహతప్పి.

దిండుమీద రెండు ఉత్తరాలు జవాబిస్తోన్నాయి; చిరుగాలిలో ఆడుతున్నాయి. 'ఉత్తరాలు—ఆత్మహత్య!' అంటో నలువయిపులా చూస్తాడు దాసు. గోడనున్నకేలెండరు గాలికి 'టప—టప' కొట్టు కొంటోంది. ద్వారాలకున్న తోరణాలు ఎండిపోయి, కింద రాలి పోతున్నాయి.

ఉత్తరాలు చదువుతాడు దాసు తలుపులు మూసి.

దాసూ!

ఉదయాన్నే నువ్వువచ్చి నన్నులేపుతావని నాకుతెలుసు. తర్వాత, ఆత్మహత్య చేసుకొన్నానని తెలుసుకొని విచారిస్తావని నాకు తెలుసు. వద్దు! నీవు దుఃఖించవద్దు!! నేను చచ్చిపోలేదు; బతికున్నాను. ఈవేళ త్రయోదశి. సాయంకాలం ఒక్కసారి తారాపథంలోకిచూడు! మున్ముందు నువ్వు మూడుచుక్కలే చూడగలవు. వాటిని మనవాళ్ళు మృగశిరచుక్కలంటారు. అవికావు, ఆమధ్యనున్నచుక్క నేను;

నాకు కుడిపక్కలోవున్నచుక్క మణి; నాకు ఎడమపక్కలోవున్న చుక్క కమల.

నేను ఆత్మహత్యచేసుకొన్నానని, నాకు నరకం ప్రాప్తమౌతోందని నీవు దుఃఖిస్తావు నాకుతెలుసు. పొరపాటుపడడం మానవ సహజం. నీవటువంటి పొరపాటుపడవద్దు. నిన్ను మేము ఎల్లప్పుడూ చూస్తునేవుంటాము. నువ్వుమాత్రం, నీకెన్నిపనులున్నాసరే, ప్రతి రోజూ సాయంకాలం నాతో షికారు రావాలి. మాతో కలసిమెలసి కొంతసేపు మాట్లాడాలి; ఆడుకోవాలి. మరిచిపోకు సుమీ!

నేను ఆత్మహత్యచేసుకొన్నది యీనాడుకాదు; ఆనాడు, ఏనాడైతే నన్ను బలవంతపెట్టి, నా హృదయం వారి స్వాధీనంచేసుకొని, నన్ను వారి బానిసగాచేసుకొని, ప్రపంచమే ఎరుగని అమాయకురాలగు కమల మెడలో మంగళసూత్రమనెడు ఓ ఉరిత్రాడు నాతో కట్టించారో, ఆనాడే నేను ఆత్మహత్యచేసుకున్నాను. నేను నరకం అనుభవించేది యీనాడుకాదు; కమలని నేను పెండ్లాడిన లగాయతు నిన్నటివరకూ అనుభవించాను. నియమితకాలం పూర్తిఅయింది. యమభటులు నన్ను విడుదలచేసారు. నేను—యీ లోకంలో—కమలామణులతో హాయిగావున్నాను. యీ లోకంలో చీకటిలేదు. నీవు మాత్రం నీపనులన్నీ జాగ్రత్తాగా చక్కబెట్టుకోవలెను. చీకట్లోవుండటానికి నీకు కష్టంగావున్నప్పుడల్లా మాతో కలసి మాట్లాడు; మాతో కలసి నవ్వు. నువ్వు, అక్కడ, ఒక్కడవు అయిపోయినావన్న ఒక్కటే విచారము నాకు. మరెంతకాలం? సంవత్సరాలు సంవత్సరాలు గడిపేసాము.

మర్చిపోకుసుమీ! నీ జాబుకోసం ఎదురుచూస్తోవుంటాను నేను. ఏనాడైతే అక్కడ బానిసత్వం రూపుమాపబడి, పరిపూర్ణ స్వతంత్రం లభ్యమౌతోందో, ఏనాడైతే అక్కడ కర్షక, కార్మికులు స్వతంత్రప్రభుత్వం స్థాపించి వాళ్ళుమట్టుకువాళ్ళే ఏకఛాటిగా ఏలుతారో, ఏనాడైతే అక్కడ జాతి, మత, వర్ణ విభేదాలు నశించి, మానవులంతా ఒకేజాతిగామారి, ఒకేమతానికి చెందినవారౌతారో, ఏనాడైతే అక్కడ ప్రేమజ్యోతులచుట్టూ మూగేవిషపురుగులు ఆ మంటల్లోపడి, మలమలమాడి, భస్మమై, ఆజ్యోతులు పవిత్రంగా, దేదీప్యమానంగా వెలగడానికి ఎటువంటి ప్రతిబంధకాలూ వుండవో, ఆనాడు నువ్వు నాకు వుత్తరం రాయాలి.

నువ్వుమాత్రం తొందరపడకు. కాలచక్రం మనోవేగంతో తిరుగుతోంది!!

మరొక్కమాట! నన్ను కావలివున్న రక్షకభటులతో నాకు చెరనుంచి విముక్తి ఐపోయిందనిచెబుతూ, ఆరెండోవుత్తరం వాళ్ళకు యిచ్చి, నీకావుత్తరం చూడాలని కుతూహలంగావుంటే, చూడు. ఏం ఫరవాలేదు. అందులో ఏం రహస్యాలూలేవు.

ఇట్లు,
నీ ప్రియమదనుడు.


# చిత్రగుప్త

మాసానికి రెండుమారులు వెలువడే జాతీయ హాస్యరస పత్రిక.

ఆంధ్రుల అభిమానమును చూరగొనిన చిత్రగుప్త దిగ్విజయంగా సాగుతూవుంది.

మీరంతా వెంటనే చందాదారులు కాగోరెదము.

| | |
|---|---|
| విడిసంచిక వెల | 0—3—0 |
| సంవత్సర చందా | రు. 4—8—0 |
| 6 మాసముల చందా | రు. 2—4—0 |

చిత్రగుప్త కార్యాలయం. సౌకార్పేట, మద్రాస్.